క్లుప్తంగా

ఘనంగా షిర్డీ సాయి దర్బార్ వార్షికోత్సవం



తోట పద్మావతి, లండా రమణ తదితరులను సత్కరిస్తున్న ఉమ్మిడి నాగరాజు తదితరులు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేటలోని శ్రీ షిర్డీ సాయి దర్బార్ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచి బాబాకు విశేష అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, ఎర్నమ్మ దేవాస్థానం చైర్మన్ లండా రమణ పాల్గొని బాబాకు పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ధర్మకర్త నాగరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు స్వాగతం పలికారు. వారికి బాబా శేష వస్త్రంతో సత్కరించారు. బాబా ప్రసాదాన్ని అందజేశారు. సాయంత్రం బాబా తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. మూడు పూటలా హారతులతో బాబా సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన




దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి కె శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె తిరుమలేశ్వర రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరమెట్టలో అధికారుల పర్యటన

అల్లిపురం: వేంకటేశ్వరమెట్టపై రోజూ తప్పనిసరిగా 45 నిమిషాలు నీటి సరఫరా జరుగుతుందని జోన్-4, జీవీఎంసీ నీటి సరఫరా, యుజీడీ విభాగం, సహాయక ఇంజినీరు డి.విల్సన్ తెలిపారు. సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'వేంకటేశ్వరమెట్టపై కన్నీటి వెతలు..!' కథనానికి ఆయన స్పందించారు. వేంకటేశ్వర మెట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. 45 నిమిషాలపాటు నీటి సరఫరా జరుగుతుందని, అయితే ధార సన్నగా ఉండడంతో కనీసం పది బిందెల నీరు కూడా నిండడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. నీటి ధార పెరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మానసిక రోగికి వైద్య సేవలు



మానసిక రోగిని ఏయూటీడీలో చేర్పిస్తున్న పీఎం పాలెం పోలీసులు

సీతమ్మధార: ఫొటోలో ఉన్న వద్ధురాలు మానసిక రోగి. ఊరు తెలియదు. సుమారు 65 ఏళ్ల ఉంటాయి. గతంలో పీఎం పాలెం పోలీసుల ద్వారా రెస్క్యూ చేసి ఈమెను అత్యవసరంగా కేజీహెచ్ సేవా వార్డులో చేర్పించగా..అక్కడ సిబ్బంది నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పుడు రెండోసారి పీఎంపాలెం పోలీసులు ఈ వద్ధురాలిని ఏయూటీడీ-జీవీఎంసీ టి.యస్.ఆర్ షెల్టర్‌కి తీసుకొచ్చారు. షెల్టర్‌లో ఉన్న వారిపై ఈమె దాడి చేస్తుండడంతో ప్రత్యేకంగా వైద్యసేవలు అందిస్తున్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

మర్రిపాలెం: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి మంగళవారం కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చోదకులను ఆపి వారికి హెల్మెట్ ధరింపజేశారు. హెల్మెట్ ధారణపై ట్రాఫిక్ సీఐ దాశరధి కౌన్సెలింగ్ ఇచ్చి, వారి వాహనాల రికార్డులను పరిశీలించారు. సురక్షితమైన ప్రయాణాలు కొనసాగించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవల్లో ముందడుగు



స్వామి వివేకానంద జయంతోత్సవాల్లో భాగంగా పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన వాల్తేర్ రౌండ్ టేబుల్



ప్రభుత్వ విక్టోరియా (ఘోషాసుపత్రి) వద్ద రోగుల సహాయకులకు కేవలం రూ.10కే భోజనం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

> ఆపదలో ఉన్నవారికి పెద్ద దిక్కుగా నిలుస్తున్నారు. ఆహారం కోసం అలమటిస్తున్నవారికి నేనున్నానని భరోసా ఇస్తున్నారు. విద్యార్థులను అక్కున చేర్చుకుంటున్నారు. పేదలకు సేవ చేయడంలో ఆయనెప్పుడూ వెనుకడుగు వేయలేదు. పేదలకు సేవ చేయడంలో తృప్తి ఉంటుందని చెబుతున్నారు వాల్తేర్ రౌండ్ టేబుల్ 356 సంస్థ చైర్మన్ మక్బూద్ అహ్మద్.
> -దాబాగార్డెన్స్

వివేకానంద సంస్థ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో 18 నెలల పాటు రూ.10కే భోజనం

ఉదారత చాటుకుంటున్న వాల్తేర్ రౌండ్ టేబుల్ 356

ఆంధ్ర, తెలంగాణ (ఉమ్మడి రాష్ట్రాల) వాల్తేర్ రౌండ్ టేబుల్ 356 సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో దూసుకుపోతోంది. సాయమందివ్వడంలో ముందుంటామంటూ ఆ సంస్థ సభ్యులు నిరంతరం చేస్తున్న సేవలే అందుకు నిదర్శనం. సేవా కార్యక్రమాల్లో భాగంగా వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులకు రెండు విడతలుగా సైకిళ్లు పంపిణీ చేసింది. పిల్లలు పాఠశాలలకు కాలినడకను వెళ్లకుండా ఉండేందుకు సంస్థ ట్యూషన్ పిల్లలకు గత జనవరి 6న 6 సైకిళ్లు అందజేశారు. తాజాగా మరో 3 సైకిళ్లు ఇటీవలే అందజేశారు.

18 నెలల పాటు..రూ.10కే భోజనం..

ఆ సంస్థ చైర్మన్ మక్బూద్ అహ్మద్ నిత్యం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా 18 నెలలుగా ప్రభుత్వ విక్టోరియా (ఘోషాసుపత్రి) ఆస్పత్రిలో పేషెంట్ల సహాయకులకు రూ.10కే భోజనాలు అందిస్తూ సేవలు కొనసాగిస్తున్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 8న నిర్వహించే మేరీ మాతా (కొండగుడి) ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు దాదాపు 4 వేల మందికి మహాన్నదానం నిర్వహించడం, వివేకానంద సంస్థలో నిత్యం డెంటల్ క్యాంపులు, జనరల్ మెడికల క్యాంపులు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. నిరుపేదలకు ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తూ పేదలకు సేవలందించేందుకు మీకు మేమున్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. నిత్యం స్వామి వివేకానంద సంస్థ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమంలో కూడా రౌండ్ టేబుల్ సంస్థ సేవలు కీలకమే.



ప్రేమసమాజం లెప్రెసీ ఆశ్రమ వాసులకు కళ్లద్దాలు పంపిణీ చేసిన వాల్తేర్ రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్బూద్ అహ్మద్, డాక్టర్ జహీర్ అహ్మద్

సేవల్లోనే తృప్తి..



పలువురు పేదలకు చేస్తున్న సేవల్లోనే తృప్తి ఉంటుంది. ముఖ్యంగా పేద పిల్లలు విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో స్వామి వివేకానంద సంస్థలో ట్యూషన్ పిల్లలకు ఎప్పటికప్పుడు విద్యకు సంబంధించిన పరికరాలు అందజేస్తున్నాం. పాఠశాలలకు కాలినడకన వెళ్లకుండా ఉండేందుకు ఇటీవల 9 సైకిళ్లు అందజేశాం. మరీ ముఖ్యంగా స్వామి వివేకానంద సహాయ సహకారాలతో విశాఖ ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి వద్ద పేషెంట్ల సహాయకులకు కేవలం రూ.10కే రుచికరమైన భోజనం గత 18 నెలలుగా అందించాం. ప్రతి ఏటా డిసెంబర్ 8న జరిగే మేరీమాత(కొండగుడి) పండగకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే వేలాది మంది భక్తులకు ఉచితంగా మహాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నాం. పిల్లల్లో దేశభక్తి అలవరచుకునే క్రమంలో గత గణతంత్ర దినోత్సవం రోజున పిల్లలచే అనేక కార్యక్రమాలు నిర్వహించాం.

మక్బూద్ అహ్మద్, చైర్మన్,
ఆంధ్ర, తెలంగాణ(ఉమ్మడి రాష్ట్రాల)
వాల్తేర్ రౌండ్ టేబుల్ 356 సంస్థ

ఘనంగా ముత్యాలమ్మ మారువారం



సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24వ వార్డులోని నక్కవానిపాలెంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మారువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారు ప్రత్యేకాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ఆవరణలో భారీ సంతర్పణ కార్యాక్రమం నిర్వహించారు. అమ్మవారిని నక్కవానిపాలెం, గాంధీ నగర్, రేసపువానిపాలెం, క్రాంతినగర్, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం,సీతమ్మధార, హెచ్‌బీ కాలనీవాసులు దర్శించుకున్నారు. అనంతరం 24 వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డిని, డీవీఎస్ ప్రసాద్‌రెడ్డిని, దళ్లి రామకృష్ణారెడ్డిని గ్రామ కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గుడ్ల కాటరాజురెడ్డి, కమిటీ ఉపాధ్యక్షుడు బోర రవికుమార్‌రెడ్డి, కార్యదర్శి కారపురెడ్డి శ్యామ్‌రెడ్డి, నందిక వేణురెడ్డి, కోశాధికారి ధర్మాల గురుమూర్తిరెడ్డి, బర్ల బాలకృష్ణ, గుప్తాజీ, నక్క అప్పలరెడ్డి, కోన గోవిందరావు పాల్గొన్నారు.

గిరిజన రోగులకు భోజన వసతి కల్పించాలి

మహారాణిపేట: కేజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చే ప్రతి గిరిజన రోగితోపాటు సహాయకులకు తప్పనిసరిగా భోజన సదుపాయం కల్పించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర కోరారు. ఇందులో ఎటువంటి జాప్యం చేయవద్దన్నారు. కేజీహెచ్‌లో గిరిజన రోగులతో వచ్చిన సహాయకులకు మంగళవారం భోజనం లేక అల్లాడిన విషయం తన దృష్టికి రావడంతో చైర్‌పర్సన్ కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌కు లేఖ రాశారు. దీనిపై కేజీహెచ్ డైటీషియన్, కేజీహెచ్ నర్సింగ్ విభాగం బాధ్యత తీసుకోవాలని, ఎటువంటి ఇబ్బంది కలగకుండా గిరిజనులకు భోజనం అందించాలని లేఖలో పేర్కొన్నారు. అలాగే రోజువారి ఇండెంట్‌లో కూడా మార్పులు చేయాలని చైర్‌పర్సన్ జె.సుభద్ర కోరారు.

చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

- కుటుంబ సభ్యుల నుంచి వివరాల సేకరించిన ఏడీసీపీ
- పాత నేరస్తులే చోరీ చేసినట్లు పోలీసుల అనుమానం



రెయ్యి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏడీసీపీ మోహనరావు

సీతమ్మధార: అక్కయ్యపాలెంలో ఓ ఇంట్లో జరిగిన చోరీపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మహారాణిపార్లర్ సమీపంలోని సరోజా ఆస్పత్రికి కొద్ది దూరంలో వాసుదేవరావు, లక్ష్మీకాంతమ్మ నివాసంలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. మంగళవారం ఏడీసీపీ మోహనరావు చోరీ జరిగిన ఇంటికి వెళ్లి పరిశీలించారు. జరిగిన ఘటనపై ఫిర్యాదుదారుడు రెయ్యి శ్రీనివాసరావు(వాసుదేవరావు కుమారుడు)తో పాటు పలువుర్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే నాలుగు బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇంటి చుట్టు పక్కల సీసీ కెమెరాలు లేకపోవడంతో పోలీసులు ఈ కేసు పెద్ద సవాల్‌గా మారింది. చేతి వేలిముద్రలు కూడా లభ్యంకాలేదు. ఆధారాలు కోసం పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. కొంత మంది పాతనేరస్తులను సీసీఎస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. బాగా తెలిసిన వారే చోరీకి పాల్పడినట్లు , ముందుగా రెక్కీ నిర్వహించి చోరీ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మొత్తం 17 తులాల బంగారం వస్తువులతో పాటు, రూ.25వేలు చోరీ అయ్యాయని బాధితుడు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

వ్యోమగామి సునీత విలియమ్స్‌కు జేజేలు



జాతీయ జెండాతో సునీత విలియమ్స్‌కు అభినందనలు తెలుపుతున్న సంస్థ ట్యూషన్ విద్యార్థులు

దాబాగార్డెన్స్: విజయోత్సాహంతో అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వస్తున్న వ్యోమగామి సునీత విలియమ్స్‌కు పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులు జాతీయ పతాకాలతో స్వాగతం పలుకుతూ..నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ ఎంతో సాహసోపేతమైన..మనోధైర్యంతో 9 నెలలు అంతరిక్షంలోనే విజేతగా నిలిచిన సునీత విలియమ్స్ భారత దేశానికే గర్వకారణమన్నారు. విజయవంతంగా భూమికి చేరుకోవాలని..ఆ భరత మాతను స్వామి వివేకానంద సంస్థ ప్రార్థిస్తోందన్నారు.

భవిత కేంద్రాల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక



మాట్లాడుతున్న గొండు సీతారాం

సీతంపేట: దివ్యాంగ పిల్లలను మానసిక, సామాజిక అభివృద్ధిలో ముందంజలో ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేయనున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ప్రాంగణంలోని భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సిబ్బంది, అధికారులు, పిల్లల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ప్రత్యేక బోధన విధానాలతో తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు ఎంతమంది, వారెక్కడ శిక్షణ పొందారు, పిల్లలకు బ్రెయిలీ లిపి, సంజ్ఞా భాష, స్పీచ్ థెరపీ వంటి విద్యా విధానాలు ఎలా అమలు చేస్తున్నారు అనే విషయాలను సర్వశిక్షా అభియాన్ పథకం ఏపీసీ జె.చంద్రశేఖర్, జిల్లా కో ఆర్డినేటర్ బి.గీతలను ఆయన అడిగి తెలుసుకున్నారు. హియరింగ్ ఎయిడ్స్, వీల్ చైర్స్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎంతవరకు ప్రవేశపెట్టగలిగారు, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయిల్లో ఇంక్లుసివ్ ఎడ్యుకేషన్‌ను ఏయే రూపాల్లో ప్రోత్సహిస్తున్నారు, కొత్త అడ్మిషన్లు ఎలా జరుగుతున్నాయో వివరాలు సేకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో భవిత కేంద్రంలో పిల్లలకు ఇస్తున్న శిక్షణ ఫలితాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ భవిత కేంద్రాల్లోని సమస్యలపై ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ రమణకుమారి, సీతమ్మధార మండల విద్యా శాఖాధికారులు రామారావు, బాలా మణి, బాల్యం ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మోహన్ కుమార్, హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నరస, భవిత సిబ్బంది చంద్రకళ, జగదాంబ, చైల్డ్ అవేర్‌నెస్ ఫోరం ప్రతినిధి ఎం.హరీష్ కుమార్ పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు జరిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

నేర విచారణలో ప్రతి ఆధారం విలువైనదే..

- డీఎస్ఎన్ఎల్‌యూలో క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ జాతీయ పోటీలు



ప్రారంభోత్సవంలో రామకృష్ణారావు, తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ 6వ జాతీయ స్థాయి పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాఖ పోలీస్ కమిషనరేట్ న్యాయ సలహాదారు రామకృష్ణారావు మాట్లాడుతూ విచారణ దశలో నేరం జరిగిన ప్రదేశం, అక్కడ దొరికే ప్రతి చిన్న ఆధారం ఎంతో విలువైనన్నారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ నేర పరిశోధనల్లో చిక్కుముడలను వివరిస్తూ, కేసు వాదన సమయంలో న్యాయవాది పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా కూడా మారాలన్నారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ మాట్లాడుతూ దర్యాప్తు అధికారులుగా ఎదుర్కొంటున్న సవాళ్లను విద్యార్థులతో పంచుకున్నారు. ఢిల్లీ ఆరుషి ప్రధాన్ కేసును ఉదహరిస్తూ విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో సీపీ డాక్టర్ నందిని, అధ్యాపకులు సీహెచ్ లక్ష్మి, రిఫాత్ ఖాన్, రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మదాసు, విద్యార్థి కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికుల చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ



జీవీఎంసీ గాంధీ పార్కులో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చలో ఢిల్లీ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను అమలు చేయడంలో వివిధ రాష్ట్రాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు..అధికారం చేపట్టిన 9 నెలలైనా ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోటా సత్తిబాబు, నాయకులు కూన కృష్ణారావు, ఏ. మదన్ మోహన్, లక్ష్మీనారాయణ, వినోద్, కలిశెట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నవ రచయితల శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ దేశాలయం, న్యూఢిల్లీ సౌజన్యంతో హిందీ విభాగ ఆధ్వర్యంలో 8 రోజుల నవ రచయిత శిబిరం నిర్వహిస్తున్న కళాశాల కన్వీనర్ డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు కళాశాల సెమినార్ హాల్‌లో మంగళవారం శిబిరం పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించారు. మార్చి 21 నుంచి 28 వరకు హిందీయేతర విద్యార్థులకు హిందీ నవ లేఖకుల శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. 8రోజులు పాటు జరిగే ఈ శిబిరంలో మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఢీల్లీ, ఆగ్రా ప్రాంతాల నుంచి విద్యార్థు, అధ్యాపకులు పాల్గొంటారని, కథ, కవిత, నాటక, వ్యాస, పత్రికా రచనలను అనువాద ప్రక్రియలను విద్యార్థులకు నేర్పిస్తారని తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు 8రోజుల పాటు ఉచితంగా నిర్వహించబోయే నవ రచయితల శిబిరం విద్యార్థులకు హిందీ భాషలో మరింత పట్టు సాధించడానికి తోడ్పడుతుందని కన్వీనర్ డాక్టర్ జయలక్ష్మి తెలిపారు.

'దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం'



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్సీ,ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికి ముక్కు సుబ్బయ్య

మహారాణిపేట: దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ,ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికి ముక్కు సుబ్బయ్య తెలిపారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బయ్య 1950 రాష్ట్రపతి ప్రకటన మూడో క్లాజు వివరణలో హిందూమతంలోని సామాజిక వివక్షతకు, అంటరానితనానికి, అవమానాలకు గురైన వారిని ఎస్సీలుగా పరిగణించబడతారని స్పష్టంగా ఉందన్నారు. దళిత క్రైస్తవులను షెడ్యూల్ కులాలలో చేరిస్తే దాని పరిణామం దళిత హిందూ దళిత సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వారి అభ్యున్నతికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. అలాంటి వారి వల్ల నిజమైన ఎస్సీ లబ్ధిదారులు రాజ్యాంగ ఫలాలు పొందలేకపోతున్నారని, మతం మార్చుకున్న వారిని ఎస్సీ కుల జాబితా నుంచి తొలగించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో వేదిక విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి శంకరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు పల్లికల శ్రీనివాసరావు, కటారి రమేష్, దశమంతుల సుశీల, జి రమా, శ్రీనివాసరావ, నరసింహ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

టూ టౌన్ సీఐకు సత్కారం



సీఐ యర్రం నాయుడిని సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

ఆరిలోవ: కైలాసగిరి హెల్త్ ఎరీనా వాకర్స్ అసోసియేషన్, తెన్నేటి లాఫ్టర్ క్లబ్, బీఎస్ఎన్ఎల్ విశ్రాంతి ఉద్యోగుల ఆధ్వర్యంలో విశాలాక్షినగర్ జ్యోతి ఆర్కేడ్‌లో మంగళవారం టూ టౌన్ సీఐ యర్రం నాయుడికి అభినందన సభ నిర్వహించారు. కైలాసగిరి హెల్త్ ఎరీనా వాకర్స్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉన్న ఆయన ఇటీవల పార్వతీపురం నుంచి బదిలీపై వచ్చి టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఆయా అసోసియేషన్ల సభ్యులు ఘనంగా సత్కరించారు. పోలీస్ ఉద్యోగంలో మరింత నిజాయితీగా సేవలందించాలని సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి జి.ఎస్.ఎన్.రాజు, తెన్నేటి లాఫ్టర్ క్లబ్ అధ్యక్షుడు కొమ్మిన సత్యనారాయణ, కై లాసగిరి హెల్త్ ఎరీనా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి సుందర రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించని షాపుల సీజ్



దుకాణానికి తాళం వేసి సీజ్ చేస్తున్న జీవీఎంసీ అధికారులు

జగదాంబ: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జోన్-4 పరిధిలో బకాయిదారులు ఆస్తులు జప్తునకు శ్రీకారం చుట్టారు. ఈమేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు, సెక్రెటరీలు, ట్యాక్స్ కలెక్టర్లలకు జెడ్సీ ఆదేశాలు జారీ చేయడంతో చర్యలకు ఉపక్రమించారు. జోన్ పరిధిలో 12 వార్డులో జీవీఎంసీ పన్నులు చెల్లించాల్సిన షాపులకు నోటీసులు అతికించారు. గృహసముదాయాలకు నోటీసులు అందజేసి నీటి కనెక్షన్‌లు కట్ చేశారు. పన్ను చెల్లించని షాపులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు మాట్లాడుతూ జీవీఎంసీ చెల్లించాల్సిన పన్ను బకాయిలపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలన్నారు. లేదంటే ఆస్తుల జప్తు తప్పదని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులకు ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయాలన్నారు. చెల్లింపులు కోసం నిరాంతరం జోనల్ కార్యాలంలో సౌకర్యం సెంటర్ అందుబాటులోనే ఉంటుందని జెడ్సీ తెలిపారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

సింహాచలం: లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు ప్రతీ విద్యార్థి కృషి చేయాలని జస్టిస్ ఎస్.వరలక్ష్మి తెలిపారు. అడవివరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. న్యాయమూర్తి జస్టిస్ వరలక్ష్మి విద్యార్థులకు పోక్సో చట్టంలోని పలు అంశాలను వివరించారు. న్యాయ సేవాధికార సంస్థ చేసే న్యాయ సహాయం గురించి తెలిపారు. బాలలపై అఘాయిత్యాలను నిరోధించేందుకు పోక్సోచట్టం ఏర్పడిందన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
S.O.P. 05/2025

Between:
1. **Smt. Isukapatla Dayavathi,** W/o. late Nageswara Rao, Hindu, Aged about 62 years (Aadhar No. 8526 2029 3138, Mobile No. 7093457545, e-mail ID: harshaivs25@gmail.com), Resident of Door No. 14-4-26/A, Anthony Nagar, Near Prema Hospital Maharanipeta, Visakhapatnam -530002.
2. **Dr. Kumari: Isukapatla Ganga Priyadarshini,** D/o. late Nageswara Rao, Aged about 33 years, (Aadhar No. 8911 9808 8779, Mobile No. 7093457545, e-mail ID: harshaivs25@gmail.com), Rest Ditto.
3. **Sri Isukapatla Venkata Sree Harha,** S/o. late Nageswara Rao, Aged about 31 years, (Aadhar No. 8519 9585 6107, Mobile No. 7093457545, e-mail ID: harshaivs25@gmail.com), Rest Ditto. .....*Petitioners*

And:
The Andhra University, Represented by its Registrar, Waltair, Visakhapatnam. .....Respondent

GENERAL PUBLICATION

It is submitted that the Petitioners herein filed the above SOP against the Respondent to Issue Sucoession Certificate to the Petitioners in respect of Schedule Property i.e., PF cash an amount of **Rs. 18,74,036/-** (Rupees Eighteen Lakh Seventy Four Thousand and Thirty Six only) lying in the Registrar, Andhra University, Waltair, Visakhapatnam on the name of Dr. Isukapatla Nageswara Rao, S/o. Venkata Rao, Employee No. 1148, Worked as UGC Research Scientist "C" Department of P.N.C.O, Andhra University College of Science & Technology, Visakhapatnam. Therefore the Public in general is hereby informed that if anyone have objections in the above matter, please appear before the Honourable Court on **25.03.2025 by 10.30 A.M.** and intimate the objections, failing which the matter will be decided ex-parte in their absence as per law.

(By order of the Honourable Court)
T.Jeevan & M. Devika, Advocates
#53-2-22, G.F.-1, Sri Raja Rajeswari Residency, Beside R.T.C. Bus Complex, Raja Veedhi, Maddilapalem, Visakhapatnam -530013
E-mail: jeevanthandasa37@gmail.com
Ph: **92466 32904, 98664 66946**
Visakhapatnam
Date: 18.03.2025